సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇవ్వాలి

- **జిల్లా కలెక్టర్ వెంకట్రావ్**

సూర్యాపేట, డిసెంబర్ 4 : జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ వైద్యాధికారులను సూచించారు. సోమవారం విద్యా, వైద్య, స్త్రీ సంక్షేమశాఖ అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిజేరియన్ వల్ల కలిగే నష్టాలను గర్భిణులకు వివరించాలన్నారు. పీహెచ్‌సీల్లో ఎక్కువగా ఓపీలు నమోదయ్యేలా, మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలకు ఆరోగ్యవిద్యపై పటిష్ట ప్రణాళికతో అవగాహన కల్పించాలని, గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలకు అందే పౌష్టికాహారం, సాధారణ కాన్పులపై కళాబృందాలతో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పాఠశాల, కళాశాలల్లో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. టీ హబ్ ద్వారా ఎక్కువ శాంపిల్స్ తీయాలని, ప్రతి పీహెచ్‌సీలో 15 శాతం శాంపిల్స్ తీయాల్సి ఉందని పేర్కొన్నారు. జిల్లాలో నియోజక వర్గాల వారీగా సీమంతాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం, డీడబ్ల్యూఓ జ్యోతిపద్మ, డీఈఓ అశోక్, ఎంఈఓలు, సీడీపీఓలు పాల్గొన్నారు.

పడిపూజలో పాల్గొన్న భక్తులు

వైభవంగా శివయ్య పడిపూజ

బొడ్రాయిబజార్, డిసెంబర్ 4 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి ఆలయంలో సోమవారం శివమాలధారులు శివయ్య పడిపూజ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమగాని లక్ష్మణ్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు వలివేటి వీరభద్రశర్మ ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం మాలధారులు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కోన ఎల్లయ్య, చింతల లింగరాజు, గుండగాని ప్రకాశ్, నారబోయిన కిరణ్, సింగ్, ఖుషి వెంకన్న, ఆలయ సహాయ అర్చకులు సాగర్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సెర్ప్ ఏపీఎం కర్ణాకర్

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

- **సెర్ప్ ఏపీఎం కర్ణాకర్**

నూతనకల్, డిసెంబర్ 4 : స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని సెర్ప్ ఏపీఎం కర్ణాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామా సంఘాల సమావేశాల్లో లావాదేవీల పారదర్శకతపై చర్చించాలని, వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. ప్రతి నెలా సంఘాలు చేయాల్సిన పనులపై చర్చించి తీర్మానాలు చేయాలన్నారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని పేర్కొన్నారు. ప్రతి నెలా మొదటి వారంలో ఆయా గ్రామాల మహిళ సంఘాలు క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని సకాలంలో చెల్లించి లబ్ధిపొందాలన్నారు. సమావేశంలో సిబ్బంది నాగార్జున రెడ్డి, ముత్తయ్య, మల్లేశ్, సరస్వతి, భాగ్యలక్ష్మి, గీత పాల్గొన్నారు.

10న మీన్స్‌కం మెరిట్ టెస్ట్

సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 4 : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్‌ను ఈ నెల 10న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో వారికి సంబంధించిన యూజర్ ఐడీ, పాస్ వర్డ్ ద్వారా లాగిన్ అయి హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే హాజరు కావాలని సూచించారు.

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 4 : సూర్యాపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సోమవారం నియోజక వర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేగా మరోమారు ఎన్నికైన జగదీశ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, అభిమానులు

వేంకటేశ్వరాలయంలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పూజలు

బొడ్రాయిబజార్ : సూర్యాపేట ఎమ్మెల్యేగా మరోమారు విజయం సాధించిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సోమవారం జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఎన్నికలకు ముందు తన నామినేషన్ పత్రాలు వేంకటేశ్వరస్వామి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన గెలిచిన తర్వాత కూడా స్వామివారిని దర్శించుకొని అర్చకుల ఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకులు జగదీశ్‌రెడ్డికి స్వాగతం పలికి అర్చనలు నిర్వహించారు. వేద ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, శ్రీహరి ఆచార్యులు, సంకర్షణాచార్యులు, ఫణికుమార్ ఆచార్యులు, ఆలయ కార్య నిర్వహణాధికారి వై. శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నాగారంలో స్వీట్ల పంపిణీ

నాగారం : సూర్యాపేట ఎమ్మెల్యేగా గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం నాగారం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డికి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, అధికార ప్రతినిధి చిల్లర చంద్రమౌళి, నాయకులు రాంరెడ్డి, అంబయ్య, బాలమల్లు, ఆంజనేయులు, మురళి, సోమయ్య, అంజి, ఎల్లయ్య, సోమలింగం పాల్గొన్నారు.

సోలిపేటలో సంబురాలు

సూర్యాపేట రూరల్ : మండలంలోని సోలిపేటలో బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. పటాకులు కాల్చి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జగదీశ్‌రెడ్డి విజయానికి కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొడ్రాయిబజార్ : పండితుల ఆశీస్సులు అందుకుంటున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఆయన తనయుడు వేమన్‌రెడ్డి

నాగారం : ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తండ్రికి స్వీట్ తినిపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జగదీశ్‌రెడ్డి గెలుపుతో దివ్యాంగుల సంబురాలు

బొడ్రాయిబజార్ : సూర్యాపేట ఎమ్మెల్యేగా మూడో సారి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విజయం సాధించడంతో పట్టణంలో సంబురాలు మిన్నంటాయి. సోమవారం బీఆర్ఎస్ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ నయీమ్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి జగదీశ్‌రెడ్డి గెలుపునకు కృషి చేసిన దివ్యాంగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏలె జానయ్య, వల్లపు లింగయ్య, సాగర్‌నాయక్, కర్నాటి జయకృష్ణ, సుశీల, కృష్ణవేణి, అక్కమ్మ, ఎస్‌కే. అఖిల్, రవిగౌడ్, సుల్తాన్‌పూర్ గురునాథ్, రాజశేఖర్, గోపిచారి పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న దివ్యాంగులు

అల్పాహారం పంపిణీ

బొడ్రాయిబజార్, డిసెంబర్ 4 : జిల్లా క్రిస్టియన్ మైనార్టీ నాయకులు పెద్దపంగు పూర్ణ, శశికాంత్ ఆధ్వర్యంలో సోమవారం సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రిలో, బధిరుల పాఠశాలలో అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ డాక్టర్ ఎం.ప్రబుదాస్ మాట్లాడుతూ దివంగత పాస్టర్ ల్యూక్ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఅప్షన్ సభ్యురాలు పి.స్వరూపరాణి, పాస్టర్ ప్రవీణ్‌కుమార్, నోయెల్, సందీప్, సంస్థ నిర్వాహకులు మదనాచారి, శ్రీరంగం రాము పాల్గొన్నారు.

నేడు, రేపు తాగు నీటి సరఫరాలో అంతరాయం

బొడ్రాయిబజార్, డిసెంబర్ 4 : సూర్యాపేట పట్టణానికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ల మరమ్మతు పనులు నిర్వహిస్తున్నందున ఈ నెల 5, 6 తేదీల్లో పట్టణానికి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ పి.రామాంజులరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని, మున్సిపల్ అధికారులకు సహకరించాలని సూచించారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 4 : కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ సహిత విశ్వనాథస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధానార్చకుడు వలివేటి వీరభద్రశర్మ ఉదయం 6 గంటలకే స్వామి వారికి అభిషేకం చేసి పూలమాలలతో అలంకరించి అష్టోత్తర హారతి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పట్టణంలోని పలు ప్రాంతాల భక్తులు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎంపీ లక్ష్మణ్‌రావు, సహాయ అర్చకుడు సాగర్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వనాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు